నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ బుధవారం 5 మార్చి 2025 | ADILABAD NIRMAL



నీరు అందక నెర్రలువారిన నేల, ఎండిన వరి పైరు


ఎండిన పొలాలను చూపిస్తున్న రైతులు


నీరు లేని సదర్మాట్ కాలువ

# రైతు బతుకు ఆగం

## వట్టిపోతున్న పంటలను చూసి దిక్కుతోచని స్థితిలో రైతాంగం

- నెర్రలుబారుతున్న భూములు.. చుక్కనీరు లేని కాలువలు..
- కలుపు దశలో నీరివ్వకపోవడంతో ఎండిపోతున్న పంటలు
- నీటిని విడుదల చేసి ఆదుకోవాలంటున్న 'సదర్మాట్' రైతులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న సాధన సమితి సభ్యులు

కడెం, మార్చి 4 : సదర్మాట్ ఆయకట్టు రైతులు సాగు నీటికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వరి నాట్ల దశలో ఉండగా నీరు అధికంగా అవసరం. నీటిని నిలిపివేయడంతో పంటలు వట్టిపోతున్నాయి. కాగా.. సదర్మాట్ ఆయకట్టు పరిధిలో ఖానాపూర్‌తోపాటు, కడెం మండలంలోని మల్లన్నపేట, లింగాపూర్, సారంగపూర్, ఎలగడప, దిల్దార్‌నగర్, పెత్తార్పు, మాసాయిపేట, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజిపేట, కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్‌తాండ, చిట్యాల, పెద్దబెల్లాల్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని వ్యవసాయ భూములకు యాసంగి పంటలకు నీరు అందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడంతో దాదాపు 12,500 ఎకరాల వరకు వరి సాగు చేశారు. నాట్లు వేసి, ప్రస్తుతం కలుపు దశకు వచ్చే సరికి ఎగువ ప్రాంతం నుంచి నీటిని నిలిపివేశారు. ప్రధానంగా ఎలగడప, పెత్తార్పు, మాసాయిపేట ప్రాంతాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. ఈ గ్రామాల పక్కనే గోదావరి ఉన్నప్పటికీ నీరు అందడం లేదు.

### కేసీఆర్ హయాంలో రెండు పంటలకు నీరు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వానకాలం, యాసంగి పంటలకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేవారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా అందించడం లేదు. సదర్మాట్ అంటేనే కడెం, ఖానాపూర్ రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆయకట్టు. దీనిని ప్రస్తుతం 14 కిలోమీటర్లపైన నిర్మించడం వల్ల కడెం మండలంలోని చివరి ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుందనేది రైతులు వాదన. ఇదిలా ఉంటే సదర్మాట్ నుంచి ప్రత్యేక కాలువను కడెం మండలానికి నిర్మించాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. ఈ రెండు మండలాలకు సదర్మాట్ ఆయకట్టు జీవనాధారం కాగా, దీనిని పట్టించుకోకపోవడంలో ప్రస్తుత సర్కారు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎస్సారెస్పీలో నీరు ఉండగా వారబందీ పద్ధతిన నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు.. ఇప్పుడు పూర్తిగా నీటి విడుదల చేయడం లేదు. నీటిని విడుదల చేసి పంటలు వట్టిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



### పంటలు ఎండుతున్నాయ్..

20 రోజులుగా కాలువ ద్వారా నీరొస్తుందని ఎదురు చూస్తున్నాం. చుక్క నీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నాం. వారబందీ పద్ధతి అన్నారు. ఖానాపూర్ మండలంలోని కొన్ని గ్రామాలకు నీరు చేరగానే కాలువను మూసివేస్తున్నారు. కడెం మండలంలోని చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. పంటలు ఇప్పటికే పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇప్పుడు నీటిని విడుదల చేయకపోతే ఇంకా అన్యాయం జరుగుతుంది.

*- జాడి గంగన్న, రైతు, పెత్తార్పు.*

### హక్కుగా ఉన్న సదర్మాట్‌ను అడ్డుకోవాల్సిన దుస్థితి



కడెం, ఖానాపూర్ మండలాల వరప్రదాయిని సదర్మాట్. అది ఈ రెండు మండలాల హక్కు. ఎగువన నీళ్లు ఉండగా ఎందుకు అన్యాయం చేస్తున్నారో అర్థం కావడం లేదు. కడెం ప్రాజెక్టుకు సరస్వతీ కాలువ ద్వారా నీటిని అందించి ఫీడ్ చేయాలి. కానీ.. సదర్మాట్ కాలువ ద్వారా నేరుగా అందించడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుంది. ఈ నీటిని పెద్దబెల్లాల్ వరకు అందించి రైతులను ఆదుకోవాలి. తరతరాలుగా సదర్మాట్ రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు. పక్షం రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటించి ఉద్యమిస్తాం.

*- హపావత్ రాజేందర్, సదర్మాట్ సాధన సమితి అధ్యక్షుడు.*


నాడు

## అప్పుడు నిండుగా.. ఇప్పుడు దండగా..

**రెండేళ్ల క్రితం వరకు** నీటితో కళకళలాడిన కుమ్రం భీం ప్రాజెక్టు కాలువలు ప్రస్తుతం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా రెండేళ్ల క్రితం వరకు యాసంగిలో కనీసం 10 వేల ఎకరాలకు సాగునీరు అందేది. కాలువల్లో నిండుగా నీరు ఉండడంతో ఆయిల్ ఇంజిన్ల ద్వారా యాసంగి పంటలకు రైతులు నీరందించేవారు. ప్రాజెక్టు కట్ట బీటలు రావవడంతో 10 టీఎంసీల సామర్థ్యాన్ని 5 టీఎంసీలకే అధికారులు పరిమితం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు, కాలువల నిర్వహణను పట్టించుకోపోవడంతో నీటిని వద్దలడం లేదు. దీంతో కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి, పంటలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ)*


నేడు

## యూరియా కోసం నిరీక్షణ

దస్తురాబాద్, మార్చి 4 : దస్తురాబాద్ పీఏసీఎస్ ఎదుట రైతులు మంగళవారం ఉదయం నుంచి బారులుదీరారు. మహిళలతోపాటు రైతులు యూరియా బస్తాల కోసం గంటల తరబడి నిరీక్షించారు. ఒక ఆధార్‌కార్డుపై మూడు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో చివరి వారికి అందలేదు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు. ఇప్పటివరకు 2,225 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చిందని.. దస్తురాబాద్, రేవోజిపేట క్లస్టర్లకు కలిపి 40 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఇండెంట్ పెట్టినట్లు ఏవో మానస తెలిపారు.


యూరియా కోసం వేచి చూస్తున్న రైతులు

## విజయోస్తు..

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- సర్వం సిద్ధం చేశాం : డీఐఈవో జాదవ్ గణేశ్

ఎదులాపురం, మార్చి 4 : ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఐఈవో జాదవ్ గణేశ్ అన్నారు. మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,880 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగనుందన్నారు. గతంలో నిమిషం అలస్యం నిబంధన ఉండడంతో ఇబ్బందులు పడ్డ విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిందన్నారు. ఐదు నిమిషాల వరకు సమయం పొడిగించిందన్నారు. గతంలో 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించి.. 9 గంటల తరువాత అనుమతి ఇచ్చే వారు కాదన్నారు. ఇప్పుడు 9.05 గంటల వరకు కూడా కేంద్రంలోని అనుమతించనున్నారు. కేంద్రంలో సీసీ కెమెరాల ద్వారా మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 31 మంది సీఎస్, 31 మంది డీవో, మూడు బృందాల కస్టోడియన్ అధికారులను నియమించామన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా సౌకర్యాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు.


ఆదిలాబాద్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈవో జాదవ్ గణేశ్

### నిర్మల్‌లో పరీక్ష రాయనున్న 6,571 మంది విద్యార్థులు

నిర్మల్ అర్బన్, మార్చి 4 ః నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 13,133 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో 6,571 మంది పరీక్ష రాయనున్నారు. వీరందరి కోసం నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు జిల్లాస్థాయి అధికారులను నియమించారు. ఇందులో డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్‌తో ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ మాస్ కాపీయింగ్ నిరోధానికి చర్యలు చేపట్టారు. 23 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 23 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 250 మంది ఇన్విజిలెటర్లు విధులు నిర్వహించనున్నారు.

## సీసీఐని పునరుద్ధరించాలి

### అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

ఆదిలాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ యంత్ర సామగ్రిని కేంద్ర ప్రభుత్వం 71 బిట్లుగా విభజించి అమ్మకానికి టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆదిలాబాద్ విశ్రాంతి భవనం వద్ద అఖిల పక్ష రైతు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకుడు విజ్జగిరి నారాయణ మాట్లాడుతూ.. సీసీఐ ఏర్పాటు కోసం రైతుల నుంచి 772 ఎకరాలు, ఎకరానికి రూ.2 వేల నుంచి రూ.3వేల చొప్పున కొనుగోలు చేశారన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలిచ్చినా, పరిశ్రమ మూతపడడంతో ఉద్యోగాలు కోల్పోయారన్నారు. దీంతో రైతులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని సీసీఐని పునరుద్ధరించాలని, లేని పక్షంలో రైతుల భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, కొండ రమేశ్, పోశెట్టి, జగన్, దేవిదాస్ పాల్గొన్నారు.


సీసీఐని ప్రారంభించాలని నినాదాలు చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

## బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన

ముథోల్, మార్చి 4 : బోరేగాం-కారేగాం గ్రామాల మధ్య గల రోడ్డుపై ఉన్న లో-లెవల్ వంతెనను తొలిగించి బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు మంగళవారం ఆందోళనకు దిగారు. ముథోల్ నుంచి వట్టోలి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే లో లెవల్ వంతెనపై సీసీ రోడ్డు వేయడానికి కాంట్రాక్టర్ సన్నాహాలు చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి తమ నిరసన వ్యక్తం చేశారు. పాత లోలెవల్ వంతెనకు పూతలు వేయడం సరికాదని, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లో లెవల్ వంతెనకు ఐదు వరసల వర్షపు నీరు ప్రవహించడానికి భారీ పైప్‌లైన్ వేయాలని లేదా బ్రిడ్జి అయిన నిర్మించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో నినదించారు. విషయం తెలుసుకున్న రోడ్లు భవనాల శాఖ డీఈఈ సునీల్ గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొనడంతో గ్రామస్తులు శాంతించారు. ఇందులో మాజీ సర్పంచ్ ఎర్రం అమృత, నాయకులు పండరి, భోజన్న, రామ్‌సేనా, కిషన్, భగత్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన చేస్తున్న బోరేగాం గ్రామస్తులు

## భవన నిర్మాణ కార్మికుల ధర్నా



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎదులాపురం, మార్చి 4 : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి బి.వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేర కు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ముత్యంరెడ్డికి 18 సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 55 ఏండ్లు నిండిన కార్మికులకు రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మ్యారేజి, మెటర్నిటి గిఫ్టులకు రూ.లక్ష, సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, హాస్పిటలైజేషన్‌కు రోజుకు రూ.1000 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్, దేవిదాస్, జిల్లా నాయకులు గౌరాల సుభాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు టౌఫీక్, అజీమ్, రాకేశ్, ఉగ్గ రాజ్, ఉషన్న, మారుతి, గణేశ్, మారుతి పాల్గొన్నారు.